
సాక్షి
కామారెడ్డి
శుక్రవారం ; 6 ; జూన్ ; 2025



బిల్లులు రాక..
బిల్లులు రాకపోవడంతో సింగితం వాగుపై వంతెన నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.
- 11లో ▸



దరఖాస్తుల వెల్లువ
గ్రామాలలో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. భూ సమస్యలపై రైతులనుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి.
- 12లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
38.0 /19.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి



కామారెడ్డి టౌన్‌: మానవ అక్రమ రవాణాను నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఈవో రాజు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని టేక్రియాల్ కేజీబీవీలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తోందన్నారు. ఇది నేరపూరితమైన చర్య అని పేర్కొన్నారు. సోషల్ మీడియాను అతిగా వినియోగించవద్దని సూచించారు. మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే ఆడపిల్లలను రక్షించుకోవచ్చని స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యురాలు స్వర్ణలత, కేజీబీవీ, మోడల్, రెసిడెన్షియల్ స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా



కామారెడ్డి టౌన్‌: నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భక్త మార్కండేయ స్వామి యంత్రమూర్తి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే నియోజకవర్గంలో చాలా వరకు ఆలయాలను అభివృద్ధి చేశామన్నారు. తాను ముస్లింను అయినా శివుడు ఆలయాల అభివృద్ధికి అవకాశం కల్పిస్తున్నాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయనను ఆలయ కమిటీ, పద్మశాలి సంఘం సభ్యులు సన్మానించారు.

నేడు విద్యుత్ సమస్యలపై సదస్సు

కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం లోకల్ సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజినీర్ కల్యాణ్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సదస్సు ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సమస్యలను సదస్సు దృష్టికి తీసుకురావాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్‌: బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద 3, 5, 8 తరగతులలో ప్రవేశాలకు అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు ఫారాలను ఈనెల 9 నుంచి 17 వరకు కలెక్టరేట్‌లోని 208 నంబర్ గదిలోగల గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో పొంది, పూర్తి వివరాలతో అందజేయాలని సూచించారు. 20న కలెక్టర్ సమక్షంలో విద్యార్థులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు గురువారం ముగిశాయని అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. చివరి రోజు యూనివర్సిటీ పరిధిలో ఏర్పాటు చేసిన 18 పరీక్ష కేంద్రాలలో 325 మంది విద్యార్థులకుగాను 13 మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షలు ప్రారంభమైన నాటి నుంచి ముగిసే వరకు వివిధ పరీక్ష కేంద్రాలలో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడు తూ మొత్తం 16 మంది డిబార్ అయ్యారన్నారు.

పెరుగుతున్న నీటి మట్టం

బాల్కొండ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 2 వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 321 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1,091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1,062.30 (12.9 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

- కామారెడ్డి బల్దియాలో సమస్యల తిష్ట
- అందుబాటులో ఉండని వార్డు అధికారులు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు



కామారెడ్డి టౌన్‌: జిల్లాకేంద్రంలో పారిశుధ్యం పడకేసింది. పాలకులు లేక.. వార్డు అధికారులు పట్టించుకోక ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డులున్నాయి. లక్షకుపైగా జనాభా, 25 వేల వరకు గృహాలు ఉన్నాయి. పాలకవర్గాల పదవీకాలం ముగిసిపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలోకి పట్టణం వెళ్లిపోయింది. బల్దియాలలో అభివృద్ధి పనులను సులభతరం చేసేందుకు, పారిశుధ్యం, నీటి సరఫరా నిర్వహణను మెరుగుపరిచేందుకు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు, ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేసేందుకు వీలుగా వార్డు స్థాయి అధికారులను నియమించింది. ప్రతి వార్డుకు ఒక అధికారిని కేటాయించారు. ప్రభుత్వం మూడు నెలల క్రితం గ్రూప్స్‌నుంచి 34 మంది వార్డు ఆఫీసర్లను కేటాయించింది. వీరితోపాటు మరో 15 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను 49 వార్డులకు ఆఫీసర్లుగా కేటాయించారు. వార్డు ఆఫీసర్లు తమకు కేటాయించిన వార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాల్సి ఉంటుంది. అయితే ఎక్కడా వార్డు ఆఫీసర్లు కనిపించడం లేదు. వార్డు ఆఫీసర్లు చాలా వరకు కార్యాలయానికి పరిమితమవుతున్నారని, మొక్కుబడిగా పనులు చేస్తున్నారని, ఫలితంగా వార్డులలో పరిస్థితి అధ్వానంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.



విద్యానగర్ కాలనీలో నిండిపోయిన మురికి కాలువ

పర్యవేక్షణ లేక..

అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా వార్డులలో పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా వీధుల్లో పేరుకుపోతోంది. మురికి కాలువలు చెత్తాచెదారంతో పూడుకుపోతున్నాయి. అపరిశుభ్ర వాతావరణంతో పలు కాలనీలు కంపుకొడుతున్నాయి. వానరాలు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. పలు కాలనీలలో ఇంటింటా చెత్తసేకరణ జరగడం లేదు. కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగక నెలలు గడుస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. తాగునీరు సమయానికి సరఫరా కాక ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. బల్దియా స్థలాలకు భద్రత లేకుండాపోయింది. అన్ని వార్డుల్లో ప్రకృతి వనాలు వికృతంగా మారాయి. డైలీ మార్కెట్ కంపుకొడుతుంది. అసెస్‌మెంట్లు ఇష్టారీతిన సాగుతున్నాయి.



అయ్యప్పనగర్‌లో పేరుకుపోయిన చెత్త

వార్డు ఆఫీసర్ల విధులివి..

- పారిశుధ్య కార్మికుల పనులను పర్యవేక్షించడం, కార్మికులకు విధులు అప్పగించడం.
- వార్డుల్లో పారిశుధ్య ప్రణాళిక అమలు చేయడం, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణను పక్కాగా అమలయ్యేలా చూడడం.
- కార్మికులతో రోడ్లు, మురుగు కాలువలు, ప్రజా మూత్రశాలలు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించడం.
- అంటువ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవడం.
- పబ్లిక్, ప్రైవేటు మార్కెట్లు, స్లాటర్ హౌజ్లు, మాంస విక్రయ దుకాణాలు పరిశుభ్రంగా ఉన్నాయో లేదో పరిశీలించడం.
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ కట్టుదిట్టంగా అమలయ్యేలా చూడడం. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ.
- నర్సరీలు, మొక్కల పెంపకం, పార్కులు వంటి పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల నిర్వహణ, నాటిన వాటిలో కనీసం 85 శాతం మొక్కలు బతికేలా చూడడం.
- ఆసరా పింఛన్లు, ఇతర అభివృద్ధి పథకాల అమలు, వీధిదీపాలు, నీటి సరఫరాను పర్యవేక్షించడం.
- కావాల్సిన సౌకర్యాలు, వసతులు, ఇతర అంశాలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం.
- ఆస్తిపన్నులు సక్రమంగా వసూలయ్యేలా చూడడం. అసెస్‌మెంట్ కానివి, పురోగతిలో ఉన్న వాటి వివరాలను ఎప్పటికప్పుడు రూపొందించడం.

ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం



కామారెడ్డి బల్దియాలో అన్ని వార్డులకు వార్డు ఆఫీసర్లను కేటాయించి బాధ్యతలను అప్పగించాం. వరుసగా ప్రభుత్వ పథకాల సర్వేలు, పన్ను వసూళ్ల లక్ష్యం ఉండడంతో వారు ఆయా పనుల్లో బిజీగా ఉన్నారు. ఇకపై వారు తమ వార్డులలో క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. వార్డు ఆఫీసర్లతో పట్టణ సమస్యలపై వారం రోజుల్లో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి

ఈసారీ నిరాశే!

- అప్‌గ్రేడ్‌కు నోచుకోని పలు కేజీబీవీలు
- ఇంటర్ విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థినులు



అప్‌గ్రేడ్‌కు నోచుకోని నాగిరెడ్డిపేట కేజీబీవీ

నాగిరెడ్డిపేట: జిల్లాలోని పలు కేజీబీవీలు అప్‌గ్రేడ్‌కు నోచుకోవడం లేదు. సరైన వసతులు లేకపోవడంతో ఆరు పాఠశాలల్లో ఇంటర్ విద్య అందుబాటులో లేదు. దీంతో ఆయా విద్యాలయాలలో పదో తరగతి చదివిన విద్యార్థినులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొందరు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

తల్లిదండ్రులను కోల్పోయిన, నిరుపేద విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 19 కేజీబీవీలు ఉన్నాయి. మొదట ఆయా విద్యాలయాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు హాస్టల్ వసతితో కూడిన విద్య అందించారు. కానీ కేజీబీవీలలో ఇంటర్ లేకపోవడంతో చాలామంది పదో తరగతితో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన పరిస్థితి ఉండేది. ఆర్థిక స్థోమత లేక చాలా మంది నిరుపేద విద్యార్థినులు ఇంటర్ విద్యకు దూరమవుతున్నట్లు గుర్తించిన సర్కారు.. కేజీబీవీలలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టింది. జిల్లాలో 19 కేజీబీవీలు ఉండగా.. గతేడాది వరకు 12 విద్యాలయాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. ఆ 12 విద్యాలయాలలో ఇంటర్ విద్య అందుబాటులో ఉంది. కాగా ఈ ఏడాది రాజంపేట మండలంలోని కేజీబీవీని అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్‌విద్యను అమలు చేస్తున్నారు. ఇంకా నాగిరెడ్డిపేట, రామారెడ్డి, మాచారెడ్డి, మద్నూర్, టేక్రియాల్, తాడ్వాయి మండలాల్లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు అప్‌గ్రేడ్ కావాల్సి ఉంది.

వసతుల లేమితో..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతులు లేకపోవడం వల్ల ఆరు పాఠశాలలు అప్‌గ్రేడ్‌కు నోచుకోవడంలేదు. ఆయా పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు మాత్రమే సరిపోయే గదులున్నాయి. సరైన వసతులు ఉన్న పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్ విద్యకు అవకాశం కల్పిస్తున్న సర్కారు.. వసతులు లేని కారణంగా జిల్లాలోని ఆరు కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేయడం లేదు. పాలకులు స్పందించి అదనపు గదులు నిర్మించి ఇంటర్ విద్యను అందుబాటులోకి తేవాలని విద్యార్థులు కోరుతున్నారు.

అప్‌గ్రేడ్ చేయిస్తాం

జిల్లాలోని కేజీబీవీలను విడతలవారీగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. గతేడాది వరకు జిల్లాలోని 12 చోట్ల ఇంటర్‌విద్యను ప్రవేశపెట్టాం. ఈసారి రాజంపేట మండలంలోని కేజీబీవీ అప్‌గ్రేడ్ అయ్యింది. జిల్లాలోని మిగిలిన పాఠశాలల్లోనూ వసతులు సమకూర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వసతుల కల్పన పూర్తవ్వగానే పాఠశాలలను అప్‌గ్రేడ్ చేస్తాం.

– సుకన్య, జీసీడీవో, కామారెడ్డి

మోదీ పాలనలో భారత్ అభివృద్ధి



మాట్లాడుతున్న గీతామూర్తి, వేదికపై పార్టీ జిల్లా అధ్యక్షుడు చిన్న రాజులు, మాజీ ఎమ్మెల్యే అరుణతార

కామారెడ్డి టౌన్‌: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం ఆర్థికాభివృద్ధి సాధించిందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి పేర్కొన్నారు. మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సంకల్ప సహకారం సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం అన్ని రంగాలలో అత్యంత పటిష్టంగా మారిందన్నారు. అన్ని దేశాలతో భారత్ సత్సంబంధాలు కలిగి ఉండటమే కాకుండా బలమైన మిత్ర పక్షంగా ఎదిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే అరుణతార, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, రంజిత్ మోహన్, పైలా కృష్ణారెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, రాము, లక్ష్మారెడ్డి, లింగారావు, వేణు, సంతోష్‌రెడ్డి, బాల్‌రాజు, అనిత, సంధ్య పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ఫుట్ పెట్రోలింగ్‌లో పాల్గొన్న ఎస్పీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్య రెడ్డి, పోలీసులు

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ రాజేశ్ చంద్ర
- పట్టణంలో ఫుట్ పెట్రోలింగ్

కామారెడ్డి క్రైం: బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జిల్లా కేంద్రంలో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన కూడళ్ల మీదుగా నిజాంసాగర్ చౌరస్తా వరకు సాగింది. ఆయా ప్రాంతాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పెట్రోలింగ్, భద్రతా ఏర్పాట్లు, జాగ్రత్తలను ఎస్పీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించడం కోసమే ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. పండుగలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి, పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సైలు, 170 మంది సివిల్, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలి



దోమకొండలో పర్యావరణ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎఫ్‌వో నిఖిత, అధికారులు, నాయకులు

దోమకొండ: ప్రకృతిని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, నీటిని పరిరక్షించడం తదితర విషయాలను వివరించారు. 170 కుటుంబాలకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ దివ్య, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, మాజీ జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాజీ సర్పంచ్ అంజలి, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

‘భూ సమస్యల పరిష్కారానికి చర్యలు’



యాచారం తండాలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సదాశివనగర్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. గురువారం యాచారం తండాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూభారతి చట్టాన్ని లింగంపేట్ మండలంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూభారతి సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూ రికార్డులలో పేర్లు తప్పుగా ఉండడం, విస్తీర్ణం తక్కువగా నమోదు కావడం, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నంబర్ మిస్సింగ్, పట్టా పాస్‌పుస్తకం లేకపోవడం, సాదాబైనామా కేసుల పరిష్కారం, హద్దుల నిర్ధారణ తదితర భూ సమస్యలకు సంబంధించి రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. వాటిని కొత్త చట్టం ప్రకారం పరిశీలించి పరిష్కారం చూపుతామన్నారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించారు. వజ్జపల్లి తండాలో పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో మొక్కల సంరక్షణను చూసి కార్యదర్శి పాపిరెడ్డిని అభినందించారు. హనుమాన్ ఆలయం ముందు వివిధ రకాల పండ్ల మొక్కలు, ఔషధాల మొక్కలు నాటాలని సూచించారు. తండాలో ఏర్పాటు చేసిన పశువుల షెడ్లు, ఫాంపాండ్‌ను పరిశీలించారు. ఆయా కార్యక్రమాలలో మండల ప్రత్యేకాధికారి సతీశ్ యాదవ్, ఆర్డీవో వీణ, తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ తిరుపతి, ఎంపీవో సురేందర్‌రెడ్డి, ఎంఈవో యోసెఫ్, ఏపీఎం రాజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ సురేందర్, నాయకులు లచ్చీరాం నాయక్, సర్దార్ నాయక్, బబ్యానాయక్, బలిరాం నాయక్, మంగ్య నాయక్, సక్కు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా సీఎంఆర్ అందించాలి



కలెక్టర్‌తో సమావేశంలో పాల్గొన్న అధికారులు, రైస్ మిల్లర్లు

కామారెడ్డి క్రైం: రైస్ మిల్లుల యజమానులు సీఎంఆర్ డెలివరీని వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. వారంలోగా బ్యాంక్ గ్యారంటీలను సమర్పించాలన్నారు. కలెక్టరేట్‌లో గురువారం రైస్ మిల్లర్లు, పౌరసరఫరాల అధికారులతో కస్టం మిల్లింగ్ రైస్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిల్లర్లకు ఇచ్చిన 2023-24 యాసంగి ధాన్యాన్ని మరాడించి వచ్చేనెల 27 లోగా సమర్పించాలన్నారు. సకాలంలో సీఎంఆర్ పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వంద శాతం సీఎంఆర్ పూర్తి చేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, పౌరసరఫరాల సంస్థ డీఎం రాజేందర్, సీఎస్‌వో మల్లికార్జున్‌బాబు, ఎల్‌డీఎం చంద్రశేఖర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



సీఎస్ఐ గ్రౌండ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్‌: ప్లాస్టిక్ వినియోగంలో నియంత్రణ పాటించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి సీఎస్ఐ గ్రౌండ్‌లోగల వారసంతలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు, ప్లాస్టిక్ వాడకం నియంత్రణపై కార్యక్రమాలు నిర్వహించారు. ఆ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులను వాడవద్దన్నారు. వాటికి బదులుగా జూట్ బ్యాగులు, స్టీలు గ్లాసులు, ప్లేట్లను, పర్యావరణహితమైన వస్తువులనే వినియోగించాలని ప్రజలను కోరారు. ప్రతి పౌరుడు విరివిగా మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్, మెప్మా పీడీ శ్రీధర్, డీఎస్‌వో సిద్ధిరాంరెడ్డి, మున్సిపల్ డీఈ వేణుగోపాల్, టౌన్ ప్లానింగ్ అధికారి గిరిధర్ కుమార్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది, మున్సిపల్ వార్డు అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ: పట్టణంలో గురువారం లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహణ కరపత్రాలను బాన్సువాడ టౌన్ సీఐ అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ తగాదాలు, సీనియర్ సిటిజన్, గ్రామాల్లో జరిగే ఇతర తగాదాలను మండల లీగల్ సర్వీస్ అథారటీ ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. వలంటీర్లు ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు ఇస్తారని అన్నారు. కమ్యూనిటి మీడియేషన్ వలంటీర్లు రామకృష్ణారెడ్డి, అయ్యాల సంతోష్, అహ్మద్ హుస్సేన్ ఉన్నారు.

మూఢ నమ్మకాలను వీడాలి



లింగంపేట(ఎల్లారెడ్డి):గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని కళా బృందం సభ్యులు వివరించారు. లింగంపేట బస్టాండ్ ఆవరణలో గురువారం తెలంగాణ సాంస్కృతిక కళా బృందం సభ్యులు జానపద గేయాలు,ఆట పాటలతో ప్రయాణికులకు అవగాహన కల్పించారు.సభ్యులు మహేందర్, రమేశ్‌రావు, విఠల్‌రెడ్డి,నాగరాజు,రాము, లక్ష్మీనారాయణ,పోశెట్టి,కాశీరాం,దివ్యశ్రీ, సవిత, లత, శిల్ప,ప్రశాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించుకోవాలి



భిక్కనూరు: రైతులు స్టార్టర్ బాక్స్‌ల వద్ద కెపాసిటర్లను తప్పనిసరిగా బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జంగంపల్లి గ్రామంలో గురువారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెపాసిటర్ల వల్ల పంపు మోటర్లకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. విద్యుత్ సిబ్బంది రైతులకు సేవ చేసేందుకు 24 గంటలు అందుబాటులో ఉంటారని, విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చన్నారు. నార్త్ ఏరియా ఏఈ బాలాజీ, ట్రాన్స్‌కో సిబ్బంది తిరుపతిగౌడ్,లింగం, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘంలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నట్లు సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. వర్షాకాలం ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు చేస్తున్న రైతుల కోసం ముందస్తుగా యూరియాను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. లింగంపేట సహకార సంఘం పరిధిలోని భవానిపేట 900 బస్తాలు, పోతాయిపల్లి 450 బస్తాలు, లింగంపేటలో 1250 బస్తాలు రైతులకు యూరియా అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. పంటల సాగుకు ముందస్తుగా అందుబాటులో ఉంచిన యూరియాను రైతులు తీసుకెళ్లాలని సూచించారు.

బ్రాండెడ్ విత్తనాలను విక్రయించాలి



ఎల్లారెడ్డి: ఫర్టిలైజర్ దుకాణాలలో నాణ్యమైన బ్రాండెడ్ విత్తనాలను మాత్రమే విక్రయించాలని సీఐ రవీంద‌ర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఆయన ఏవో నయిమొద్దీన్‌తో కలిసి పరిశీలించారు. దుకాణాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. స్టాక్ వివరాల బోర్డును ప్రదర్శించాలని, నకిలీ విత్తనాలను విక్రయించవద్దని దుకాణాదారులకు సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

అసలు, వడ్డీ చెల్లించాకే రెన్యువల్

- గోల్డ్ రుణాలపై మారిన నిబంధనలు
- రెన్యువల్ కోసం రుణం మొత్తం చెల్లించాల్సిందే
- సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బందులు
- వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రుణగ్రహీతలు

గోల్డ్ లోన్ రెన్యువల్ ప్రక్రియకు ఆర్‌బీఐ విధించిన నిబంధనలు రుణగ్రహీతలకు ప్రతిబంధకంగా మారాయి. గతంలో ఏడాదికోసారి వడ్డీ చెల్లిస్తే సరిపోయేది. కానీ, ఇక మీదట ఏడాది కాగానే అసలు, వడ్డీ మొత్తం చెల్లించిన తర్వాతే రెన్యువల్ చేస్తామని బ్యాంకర్లు చెబుతున్నారు. దీంతో రుణగ్రహీతలు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది.



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణానికి చెందిన రైతు రమేశ్ (పేరు మార్చాం) వ్యవసాయ అవసరాల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడాలో ఏడాది క్రితం బంగారంపై తీసుకున్న రూ.3 లక్షల రుణానికి వడ్డీ చెల్లించి రెన్యువల్ చేసుకునేందుకు బ్యాంకుకు వెళ్లాడు. తీసుకున్న రుణం రూ.3 లక్షలతోపాటు ఏడాది వడ్డీని ఖాతాలో జమ చేస్తే వడ్డీ మినహాయించి మిగిలిన మొత్తం రుణాన్ని రెన్యువల్ చేస్తామని చెప్పారు. లేనిపక్షంలో రెన్యువల్ సాధ్యం కాదని, దీంతో సిబిల్ స్కోర్ తగ్గడంతోపాటు బంగారం వేలం తదితర ప్రక్రియలు ఉంటాయని హెచ్చరించారు. దీంతో చేసేదేమీ లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులను సంప్రదించి రూ.3 లక్షలను రూ.2 వడ్డీకి తీసుకువచ్చి బ్యాంకులో చెల్లించి బంగారం రుణాన్ని రెన్యువల్ చేసుకొని వచ్చిన డబ్బులను తిరిగి వడ్డీ వ్యాపారికి చెల్లించాడు. ఈ నిబంధనతో సదరు రైతు రూ.లక్షకు సుమారు రూ.3 ల చొప్పున వడ్డీ చెల్లించాల్సి వచ్చింది. ఇది కేవలం ఒక్క బ్యాంకుకు మాత్రమే పరిమితం కాలేదు. బంగారం తనఖాపై రుణాలు ఇచ్చే ప్రతీ బ్యాంకులో రుణగ్రహీతలు ఇలాంటి ఇక్కట్లనే ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో వడ్డీ వ్యాపారుల వద్ద చేతులు చాపలేక ఇంట్లో ఉన్న బంగారాన్ని బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకొని ఏటా రెగ్యులర్‌గా వడ్డీ చెల్లిస్తున్న సాధారణ, మధ్య తరగతి కుటుంబీకులకు ఆర్బీఐ నిబంధనలు మళ్లీ అప్పులపాలు చేస్తున్నాయి.

ఆర్బీఐ నిబంధనలు అమలు చేస్తున్నాం

ఆర్బీఐ నిబంధనల్లో భాగంగానే ఏడాది పూర్తి చేసుకున్న బంగారు రుణాలను రెన్యువల్ చేస్తున్నాం. తీసుకున్న రుణం మొత్తం ఏడాది వడ్డీతో సహా చెల్లించి రెన్యువల్ చేసుకొనే నిబంధన రుణ గ్రహీతలకు ఇబ్బందికరంగానే ఉంటుంది. గతంలో కేవలం ఏడాది వడ్డీ చెల్లించి రుణం రెన్యువల్ చేసుకొనే వెసులుబాటు ఉండేది. తాజా నిబంధనలతో గోల్డ్ లోన్స్ తగ్గిపోయే అవకాశం ఉంది.

– సుంకం వీర గణేశ్ చారి, గోల్డ్ అప్రైజల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఆర్మూర్

పసుపు సాగులో మెలకువలు



పసుపు పంటను విత్తుతున్న రైతులు

బాల్కొండ: ఖరీఫ్ సీజన్‌లో పసుపు సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ముందస్తు వర్షాలతో కొందరు రైతులు పసుపు విత్తడం ప్రారంభించారు. జిల్లాలో సుమారు 33 వేల ఎకరాల్లో పసుపు పంటను రైతులు సాగు చేస్తారు. పసుపు సాగులో మెలకువలను పాటించాలని ఆర్మూర్ డివిజన్ ఉద్యానవన అధికారి రుద్ర వినయ్ రైతులకు పలు సూచనలు, సలహాలు చేస్తున్నారు. ఆయన మాటల్లోనే..

నేల తయారీ..

నేలను బాగా లోతుగా దున్నాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి 40 ట్రాక్టర్ల నల్లమట్టిని నేలలో వేయాలి. ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను వాడాలి. అడుగు మందుగా ఎకరానికి ఆరు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లాలి.

బెడ్ విధానంలో ఇలా..

బెడ్ పద్ధతిలో విత్తినట్లయితే విత్తే రోజు బెడ్ మీద, బెడ్ మధ్యలో 45 సెంటీ మీటర్ల ఎడం ఉండేట్లు రెండు లైన్లు , రెండు అంగుళాల లోతు ఉండేట్లు ఏర్పాటు చేసుకోవాలి. బెడ్ మీద ఎకరానికి మూడు సంచుల వేప పిండి, ఒక్క బస్తా యూరియా, ఒక్క బస్తా పొటాష్ కలిపి లైన్లలో వేయాలి. బెడ్‌పై లైన్లలో విత్తన ముక్కల్ని సుమారుగా 22.5 సెంటీమీటర్లు (9 అంగుళాలు) దూరం ఉండేట్లు విత్తి బాగా కప్పేయాలి. డ్రిప్పు పైపులు పరిచి నీరు బాగా అందేట్లుగా వదలాలి.

కలుపు నివారణ

విత్తనం వేసిన మరుసటి రోజు ఎకరానికి కిలో చొప్పున అట్రాజిన్ కలుపు మందును 200 లీటర్ల నీటితో పిచికారీ చేయాలి. విత్తనం వేసిన 21 రోజులకు మొలక వస్తుంది. ఎక్కడైనా గ్యాపులు వస్తే ముందే ట్రేలలో పెంచిన మొక్కలను వాడాలి.

విత్తనం ఆదా.. విత్తన శుద్ధి ఇలా

కొత్త పద్ధతిలో భాగంగా విత్తన కొమ్మును చిన్నచిన్న ముక్కలు చేయడం ద్వారా విత్తన ఆదా చేసుకోవాలి. విత్తనాన్ని ఒక్క అంగుళం ఉండేట్లు ముక్కలు చేయాలి. దీంతో ఎకరానికి రెండు క్వింటాళ్ల విత్తనం మాత్రమే సరిపోతుంది. విత్తన ముక్కల్ని లీటర్ నీటికి 3 గ్రాముల చొప్పున రిడోమిల్ గోల్డ్ కలిపి తయారు చేసిన మంచు ద్రావణంలో అరగంట సేపు నానబెట్టి శుద్ధి చేసి ఆరబెట్టాలి. విత్తన శుద్ధి రెండు, మూడు రోజుల ముందు చేసుకోవాలి. దీంతో విత్తనం వేసే రోజు హడావుడి ఉండదు. పొలుసు, పురుగు ఉన్న చోట విత్తన శుద్ధి చేసేటప్పుడు లీటర్ నీటికి 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోపాస్ కలపాలి.

8న పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక



మాట్లాడుతున్న అధ్యక్షుడు దాసరి నర్సింలు

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 8న ఆదివారం ఏడో పద్మశాలి వధూవరుల పరిచయ వేదికను నగరంలోని వినాయక్‌నగర్‌లో గల విజయలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు దాసరి నర్సింలు తెలిపారు. ఖలీల్‌వాడిలోని సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిచయ వేదికను విజయవంతం చేసేందుకు తమ బంధుమిత్రుల ఇళ్లలో పెళ్లి వయస్సు వచ్చిన అమ్మాయిలు/అబ్బాయిలను తీసుకువచ్చి నమోదు చేసుకొని విజయవంతం చేయాలన్నారు. వధూవరుల రిజిస్ట్రేషన్ కోసం ఎలాంటి ఫీజు లేదని, పాల్గొన్న వారికి భోజన వసతి కల్పిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం 94400091895, 9848047026, 7386323505 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మైసల నారాయణ, చిలుక నర్సయ్య, భీమర్తి రవి, లోల రాజేందర్, ఆడెపు రాజన్న, భూస శ్రీనివాస్, దిండిగల్ల శంకర్, ధోర్నాల రవి, కోడూరు స్వామి, బీజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన బస్సు.. పలువురికి గాయాలు

మాచారెడ్డి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో స్పీడ్ బ్రేకర్ల వద్ద గురువారం ఓ బస్సు అదుపు తప్పడంతో పలువురికి గాయాలయ్యాయి. ప్రయాణికుల కథనం ప్రకారం... కరీంనగర్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు స్పీడ్ బ్రేకర్లు దాటుతుండగా అదుపు తప్పడంతో బస్సు టాపు తగిలి కొందరికి, సీట్లు తగిలి మరికొందరు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే అదే బస్సులో క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్పీడ్ బ్రేకర్లు చాలా ఎత్తుగా ఉండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోయారు. ఎత్తు తగ్గించాలని కోరారు.

క్రైం కార్నర్

సెలవుల్లో వచ్చి మృత్యు ఒడిలోకి

కుంటలో పడి బాలుడి దుర్మరణం

ఖలీల్‌వాడి: వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చిన ఓ బాలుడు కుంటలో పడి దుర్మరణం చెందిన ఘటన నగరంలోని బాబన్‌సాహెబ్‌పహాడ్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఆరో టౌన్ ఎస్సై వెంకట్రావ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌కు చెందిన అమన్‌వుద్దీన్(13) నగరంలోని హైమద్‌పురా కాలనీలో ఉన్న బంధువుల ఇంటికి సెలవుల్లో వచ్చాడు. ఇద్దరు పిల్లలతో కలిసి అమన్‌వుద్దీన్ బుధవారం బయటికి వెళ్లాడు. జాల్ తలాబ్‌లో స్నానం చేస్తుండగా నీట మునిగాడు. వెంట వెళ్లిన ఇద్దరు పిల్లలు ఆ విషయం కుటుంబసభ్యులకు చెప్పలేదు. దీంతో అమన్‌వుద్దీన్ కనబడటం లేదని బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం పిల్లలు అసలు విషయం చెప్పటంతో జాల్‌తలాబ్‌లో వెతకగా అమన్‌వుద్దీన్ మృతదేహం లభించింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లి తిట్టిందని కూతురి ఆత్మహత్య



వరలక్ష్మి మృతదేహం

పిట్లం(జుక్కల్): తల్లి తిట్టిందని కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుడగ జంగం కాలనీకి చెందిన సంకు వరలక్ష్మి(14)ను బుధవారం సాయంత్రం ఇంటి తాళపు చెవిని పోగొట్టిందని తల్లి సంకు కవిత తిట్టింది. దీంతో మనస్తాపం చెందిన వరలక్ష్మి ఇంట్లోకి వెళ్లి దులానికి చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాటర్ హీటర్ షాక్‌తో వృద్ధురాలి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక్‌నగర్‌లో వాటర్ హీటర్ షాక్‌తో రాథోడ్ వీణ(61) మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. నిర్మల్ జిల్లా నాశేశ్వర్ మండలం పుష్పల్ గ్రామంలోని దుర్గా తండాకు చెందిన రాథోడ్ వీణ ఐదేళ్లుగా కూలీ పని చేసుకుంటూ వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటోంది. గురువారం ఉదయం వీణ స్నానం చేసేందుకు వాటర్‌హీటర్‌ను బకెట్లో పెట్టి కొంత సమయం తర్వాత నీళ్ల వేడిగా మారాయో? లేదో తెలుసుకునేందుకు చేతిని నీటిలో పెట్టింది. విద్యుత్ షాక్ తగలడంతో కేకలు వేస్తూ పడిపోయింది. స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కోడలు రాథోడ్ రేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీజీహెచ్‌లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లకు ఇక్కట్లు



నిరసన తెలుపుతున్న యాత్రికులు

నిజామాబాద్ నాగారం: ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇవ్వడంలో వైద్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అమర్‌నాథ్ యాత్రికులు గురువారం జీ జీ హెచ్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భక్తుడు ధాత్రిక రతన్ మాట్లాడుతూ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన భక్తులను ఏడంతస్తుల మేడలో కిందకు, పైకి తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. జీజీహెచ్ అధికారులు, సూపరింటెండెంట్ స్పందించి భక్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. పాల్వంచ మండలం బండరామేశ్వరపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారంతో వెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

అనారోగ్యంతో మహిళ..

వర్ని: వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని తగిలేపల్లి గ్రామానికి చెందిన ఎర్రోళ్ల మక్కవ్వ (45) అనారోగ్య కారణాలతో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మక్కవ్వ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. బాధ భరించలేక గురువారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కొడుకు రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు ఒకరు..

సిరికొండ: మండలంలోని మెట్టుమర్రి తండా అటవీ ప్రాంతంలో ప్రమాదవశాత్తు ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఎల్ రామ్ గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన రమణయ్య కొన్నేళ్లుగా తండాలో ఉంటూ మేస్త్రీ పని చేస్తున్నాడు. అతనికి ఎవరూ లేకపోవడంతో తండావాసులే రేకుల షెడ్డు వేసి ఇచ్చారు. మద్యానికి బానిసైన రమణయ్య అటవీ ప్రాంతంలో మృతి చెందాడని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువతి అదృశ్యం

రెంజల్(బోధన్): ఎడపల్లి మండలంలోని అంబం గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు రెంజల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వారం రోజుల కిందట రెంజల్‌లోని తాతయ్య ఇంటికి వచ్చినట్లు పేర్కొన్నారు. గురువారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లినట్లు తెలిపారు. కుటుంబీకులు, బంధువుల ఇళ్లల్లో గాలించినా కనిపించకపోవడంతో తాత రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నాటి అల్లకొండనే నేటి బాల్కొండ

మీకు తెలుసా?



అల్లయ్య, కొండయ్య విగ్రహాలు

రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన బాల్కొండ ఒకనాటి అల్లకొండ. క్రీ.శ 1059లో సంధికాలంలో ఏర్పడ్డ అల్లకొండను, అల్లయ్య, కొండయ్య అనే మల్లయోధులు పాలించడంతో ముందుగా అల్లకొండగా పేరొందింది.

- కాలక్రమేనా అల్లకొండ క్రీ.శ 1422 తర్వాత బాల్కొండగా పిలువబడుతూ ప్రస్తుతం బాల్కొండ మండల కేంద్రంగా, నియోజకవర్గ కేంద్రంగా చెలామణి అవుతోంది.
- అల్లయ్య, కొండయ్యలు పాలించారనడానికి నిదర్శనంగా వారి విగ్రహాలు ఇప్పటికీ బాల్కొండ ఖిల్లాలో ఉన్నాయి.
- యుద్ధ పోరాటంలో బహమనీ సుల్తానులు వాళ్ల కాళ్లు, చేతులు నరికి వేశారు. దీంతో వారి విగ్రహాలు కూడా కాళ్లు, చేతులు లేకుండానే ఉండడం విశేషం.

– బాల్కొండ

కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు ఇలా..

మీ కోసం



రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తోంది. ఐతే, ఈ కొత్త రేషన్ కార్డులకు అర్హత ఏమిటి? ఎలా దరఖాస్తు చేసుకోవాలి? ఏయే పత్రాలు అవసరం? అనే వివరాలు మీ కోసం...

- రేషన్ కార్డుకు ప్రధాన అర్హత వార్షిక ఆదాయ ధ్రువీకరణ. గ్రామీణ ప్రాంతాల్లో వారికి రూ. లక్షా 50 వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలు మించకూడదు.
- మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు కుటుంబసభ్యుల ఆధార్ కార్డులు, ఇంటి యజమాని కరెంట్ బిల్లు, గ్యాస్ సిలిండర్ పుస్తకం దరఖాస్తుకు జత చేయాలి. ఉంటే ద్విచక్ర వాహన ఆర్‌సీ లేదంటే ఓటరు కార్డు జిరాక్సు పెట్టాలి.
- దరఖాస్తు పూర్తయిన తర్వాత దానిని స్థానిక తహసీల్ కార్యాలయంలో అందజేస్తే అధికారులు పరిశీలించి ప్రభుత్వానికి ఆన్‌లైన్‌లో పంపుతారు. అనుకూలత మేరకు ప్రభుత్వం రేషన్ కార్డు మంజూరు చేస్తుంది.
- కారు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు ఉండకూడదు. ప్రభుత్వ ఉద్యోగం, ఐదెకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్నా కొత్త రేషన్ కార్డుకు అనర్హులే.
- ఇప్పటికే రేషన్‌కార్డు ఉండి అందులో కుటుంబసభ్యుల పేర్లు చేర్పులు, మార్పులు చేయాలంటే సంబంధితుల ఆధార్ కార్డు దరఖాస్తుకు జత చేయాలి.

– డొంకేశ్వర్(ఆర్మూర్)

గ్రూపు రాజకీయాలకు చెక్

- ఎంపీ ల్యాడ్స్ ప్రొసీడింగ్స్‌ను స్వయంగా ఇవ్వనున్న అర్వింద్ ధర్మపురి



ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో గ్రూపు రాజకీయాలకు చెక్ పెట్టేందుకు ఎంపీ అర్వింద్ ధర్మపురి కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎంపీ ల్యాడ్స్ ప్రొసీడింగ్స్ విషయంలో స్వయంగా తనే పనులను ఫైనల్ చేయనున్నట్లు సమాచారం. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏడాదికి రూ.70 లక్షలు కేటాయిస్తున్నారు. కొవిడ్ సమయంలో కాకుండా తర్వాతి ఏడాది నుంచి రూ.5 కోట్ల ఎంపీ నిధులను ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన కార్యాలయానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, స్థానిక అవసరాల నిమిత్తం నిధులను సమానంగా కేటాయించేవారు. స్థానిక నాయకుల సిఫార్సులకు ప్రాధాన్యత ఇస్తూ నియోజకవర్గ ముఖ్య నాయకులు, మండలాల అధ్యక్షులు, కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ముఖ్యమైన పనులకు నిధులు కేటాయిస్తూ, ప్రొసీడింగ్ పత్రాలను ముఖ్య నాయకుల ద్వారా అందించేవారు. కాగా, ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బీజేపీ నాయకుల గ్రూపు రాజకీయాల నేపథ్యంలో ఎంపీ ల్యాడ్స్ ప్రొసీడింగ్స్ అందజేతపై నిర్ణయం మార్చుకున్నారు. ఈ విషయమై తన కార్యాలయ సిబ్బందిని సైతం ఆదేశించినట్లు తెలిసింది. నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమవుతున్న నేపథ్యంలో పార్టీలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపులు, వాటి ఖర్చు, అభివృద్ధి పనులు, నిధుల విషయంపై ఎంపీ అర్వింద్ స్వయంగా పర్యవేక్షిస్తారని సమాచారం.

ఏడాదైనా దొరకని ఏటీఎం దొంగలు

- రూ. 25 లక్షల నగదు చోరీ
- బాల్కొండ మండల కేంద్రంలో ఏటీఎం ధ్వంసం



గ్యాస్ కట్టర్‌తో ధ్వంసం చేసిన ఏటీఎం (ఫైల్)

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రంలోని వన్నెల్(బి) చౌరస్తా వద్ద ఎస్‌బీఐ ఏటీఎంలో గతేడాది జూన్ 4న అర్ధరాత్రి తర్వాత భారీ చోరీ జరిగింది. రెక్కీ నిర్వహించి 9 నిమిషాల వ్యవధిలోనే రూ. 24 లక్షల 92 వేల 600 ఎత్తుకెళ్లారు. దొంగిలించిన కారులో వచ్చిన దుండగులు గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. కాగా, ఏడాది కాలం గడుస్తున్నా ఇప్పటి వరకు దొంగల ఆచూకీ లభించలేదు. కేసు ఛేదనలో పోలీసులు పూర్తిగా విఫలం చెందారనే విమర్శలు వస్తున్నాయి. 2022 జూలైలో మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సైతం ఇదే తరహా చోరీ జరిగింది. నగదు కాలిబూడిద కావడంతోపాటు 8 కిలోల బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. ఆ ఘటనలో కూడా గ్యాస్‌కట్టర్‌లతోనే లాకర్లను ధ్వంసం చేశారు. కాగా, కేసులో సగం మంది దొంగలను పోలీసులను పట్టుకున్నారు. 2023 సెప్టెంబర్‌లో మెండోరా మండలం పోచంపాడ్ ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ఉన్న ఏటీఎంను ధ్వంసం చేసి రూ. 12 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఆ కేసు ఇప్పటి వరకు కొలిక్కి రాలేదు.

త్వరలోనే పట్టుకుంటాం..

బాల్కొండ మండల కేంద్రంలో గతేడాది ఏటీఎం ధ్వంసం చేసి జరిగిన చోరీపై దర్యాప్తు కొనసాగుతోంది. త్వరలోనే దొంగలను పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తాం.

– శ్రీధర్‌రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ, బాల్కొండ

వినియోగదారుల కమిషన్‌లో వృద్ధ దంపతుల విజయం

- నందిపేట జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖకు మొట్టికాయలు
- రూ.2 లక్షలు వడ్డీతో సహా చెల్లించాలని ఉత్తర్వులు

నందిపేట్(ఆర్మూర్): కేంద్ర సహకార బ్యాంకు ప్లాటినమ్ జూబ్లీ సర్టిఫికెట్ పథకంలో డిపాజిట్ చేసి మెచురిటీ విషయంలో నెలకొన్న వివాదంలో వృద్ధ దంపతులకు అనుకూలంగా గురువారం నిజామాబాద్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు వెలువరించింది. వృద్ధ దంపతులను ఇబ్బందులకు గురి చేసిన నందిపేట జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు మొట్టికాయలు వేసింది. వివరాలిలా ఉన్నాయి. నందిపేట మండలం కంఠం గ్రామానికి చెందిన భార్యాభర్తలు పెంట భూమన్న (82), పెంట లింగుబాయి(72) నందిపేట మండల కేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ బ్రాంచీలో ప్లాటినమ్ జూబ్లీ పథకంలో భాగంగా 1997 ఆగస్టు 21న ఒక్కొక్కరూ రూ. 3,122 చొప్పున డిపాజిట్ చేశారు. అందుకు బ్యాంకు ప్లాటినమ్ సర్టిఫికెట్ అందజేసింది. పథకంలో పేర్కొనబడిన విధంగా పదేళ్ల కాలానికి (2007 ఆగస్టు 21) రూ.12,493 మెచురిటీ కాగా తిరిగి ఆ డబ్బును బ్యాంకు రెన్యువల్ చేసుకోగా అవి 2017 ఆగస్టు 22 నాటికి రూ. 49,990 అయ్యాయి. మరో ఐదేళ్ల కాలానికి (2022 ఆగస్టు 21) మొత్తం రూ. లక్ష చెల్లించాల్సి ఉంది. ఇవన్నీ ప్లాటినమ్ జూబ్లీ సర్టిఫికెట్ పథకంలో భాగంగా 1997లో జారీ చేసిన సర్టిఫికెట్‌లో పేర్కొన్నారు. 25 ఏళ్లకు మెచురిటీ తీరడంతో 2022 ఆగస్టులో తమకు రావాలిసిన రూ.లక్ష ఇవ్వమని వృద్ధ దంపతులు దరఖాస్తు చేసుకోగా, వారి అభ్యర్థనను తిరస్కరిస్తూ ప్రస్తుత నిబంధనలు, వడ్డీ రేట్ల మార్పు ఫలితంగా అంత మొత్తం చెల్లించలేమని, రూ. 35 వేలు మాత్రమే చెల్లిస్తామని తెలిపారు. ఆఖరిగా రూ. 39,996 ఇవ్వగలమని బ్యాంకు సిబ్బంది వెల్లడించారు. దీంతో వృద్ధ దంపతులు న్యాయవాది గాలిపెల్ల వెంకటేశ్వర్ ద్వారా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. 2023 సంవత్సరంలో సహకార బ్యాంకుపై ఫిర్యాదు చేశారు. అన్ని రకాల ధ్రువపత్రాలు అధ్యయనం చేసిన కమిషన్ ఫిర్యాదుదారులైన వృద్ధ దంపతులు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 2 లక్షలు చెల్లించాలని, అంతేగాకుండా 21 ఆగస్టు 2022 నుంచి 7.5 శాతం వడ్డీని సైతం చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయమై నందిపేట సహకార బ్యాంకు మేనేజర్ సీహెచ్ రాధను వివరణ అడగగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని వెల్లడించారు.

బైకు, బస్సు ఢీ.. ఒకరికి గాయాలు

మాక్లూర్ : మండలంలోని మానిక్‌బండార్ చెక్క వద్ద గురువారం ఎదురుగా వస్తున్న బైకును టీజీ ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో బైకుపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108లో ఆస్పత్రికి తరలించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్సై రాజశేఖర్ తెలిపారు.